కథా నిలయం
Ramu
Rent
Book
Stall
3641
[illegible] శ్రీకాకుళం

# జైలు

సింహాద్రికి, అతని గుడ్డలు అతనికి తిరిగి ఇచ్చేస్తూ అన్నాడు వార్డరు "ఎన్నిసార్లొస్తావురా ఇక్కడికి? ఈసారైనా ఏదైనా పనీపాట్రా చూసుకో, మంచివాడి వనిపించుకోరా!"

సింహాద్రి, వార్డరువేపు చూశాడు. ఆ కళ్ళలో కోపమూ, ఆకలీ కన్పించాయి వార్డర్‌కి. సింహాద్రి మాట్లాడకుండా గుడ్డలు తీసుకుని, ప్రక్కనేవున్న చిన్న గదిలోకి వెళ్ళి, తను కట్టుకున్న బనీను, నిక్కరూ అక్కడ వదిలిపెట్టి, తన గుడ్డలు చిరిగిపోయినవి, కొంచెం మాసిన, వాసన వేస్తున్నవి, సరిగ్గా రెణ్ణెల్లా పదిహేను రోజులు తర్వాత తొడుక్కున్నాడు. తొడుక్కుంటూ అలవాటుకొద్దీ లాల్చి జేబులో చేతులు పెట్టుకున్నాడు. జేబులు చిల్లులు పడినందువల్ల, చేతులు బయటకు వచ్చేశాయి. పైజమా వేపు చూసుకున్నాడు. రంగు మాసిపోయి వెలవెల పోతున్నది. మఫ్లరు

మెడచుట్టూ కప్పుకొని, పెరిగిన గడ్డాన్ని సవరించుకొని, మళ్ళీ ముందు గదిలోకి వచ్చాడు.

కుర్చీలో కూచునివున్న వార్డరు అతనివైపే ఆశగా చూస్తున్నాడు. సింహాద్రి అతనికి దగ్గరగావచ్చి కిటికీలో నుండి బయట ఎగిరేపక్షిని చూస్తూ నిర్లక్ష్యంగా "వస్తా" అన్నాడు; అని గుమ్మం వేపుగా రెండడుగులు వేశాడు. వెనకనుంచి చూస్తే సింహాద్రి అజానుబాహు శరీరం భయం కల్గిస్తోంది. కుర్చీలో కూచునే "తమ్ముడూ! మామూలేదీ?" అన్నాడు వార్డరు నంగి నంగిగా.

"అదీ ఇదీ కలిపి ఈసారొచ్చినప్పుడు" సింహాద్రి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ గది దాటి, జైలుదాటి రోడ్డుమీదకు వచ్చాడు.

సాయంకాలం ఆరు దాటింది. మిట్ట మధ్యాహ్నమే, సెంట్రల్ జైలు దగ్గర చీమ చిటుక్కుమనేటంత నిశ్శబ్దంగా ఉంటుంది; ఆరు దాటింతర్వాత ఉన్న ఒకరిద్దరూ కూడా గూళ్ళు చేరుకుంటారు. కాపలా వాళ్ళ కేకలూ, పక్షుల కూతలూ తప్ప అక్కడ మరొక శబ్దం విన్పించదు, మరో ప్రాణి కన్పించదు. సింహాద్రికి, రోడ్డు తన జీవితంలా అష్ట వంకర్లుగానూ కన్పిస్తోంది. రోడ్డు ప్రక్కన గుబురు గుబురుగా పెరిగిన చెట్లు, చెట్లమధ్యన కనిపించని కదలికలు, గోదావరి మీదనుంచి వీస్తోన్న సాయంత్రపు గాలి, పసిపిల్ల రొదలా, చెవుల్లో దూరి హృదయాన్ని అర్ద్రపరుస్తోంది. సింహాద్రి. మఫ్లరు చెవులమీదకు లాక్కున్నాడు. అతని ఆలోచనలు ఒకదానిమీదా కేంద్రీకరింప బడడంలేదు.

ముందుగా అతనికి బుడిగి జ్ఞాపకం వచ్చింది. దాని చేరదీసి కళ్ళు, చూపులతో వాడికి చక్కిలిగింతలు పెట్టాయి. దానికి తను అన్యాయం చేస్తున్నాడేమో అనిపించింది కొంచెం సేపు వాడికి.

వాణ్ణి మళ్ళీ పోలీసులు పట్టుకున్నారని తెలిసినవాడు దాని గుండె బ్రద్దలై పోయింది. కోర్టులో విచారణ ముగిసి, వాడికి రెణ్ణెల్లకుపైగా శిక్షపడి, వాణ్ణి పోలీసులు బయటకు తీసుకు వచ్చినప్పుడు అది వాడిదగ్గరకు వెళ్ళి ఏదో చెప్పబోయింది. దాని గొంతు గద్గదికమైంది. దాని కళ్ళలో నీటి పొర నిల్చి, వాణ్ణి సరిగా చూడనీయలేదు. "మావాఁ!" అన్నమాట మాత్రం వాడికి విన్పించింది వాడికి తెలుసు, 'మావా!' అన్న ఆ ఒక్కమాటలో అది ఏళ్ళు పూర్తిగా తనమీద పేర్చుకున్న మమత, బాంధవ్యమూ, దాని పాలిట తన కర్తవ్యమూ అన్నీ పేరుకొని ఉన్నాయని

"వీడవకే! మళ్ళీ వస్తాగా?" అన్నాడు సింహాద్రి.

ఆమాట విని బుడిగి మొహంలో చిరుకోపం కన్పించింది. "ఆ! వస్తావ్? రావటం, పోవటం మూణ్ణాళ్ళు పట్టదు. ఇది ఎన్నో సారి?"

చురుక్కున కొండాలా తగిలింది సింహాద్రికి ఆమాట. పెళ్ళయిన తర్వాత ఇది తను ఆరోసారి జైలుకు వెళ్ళడం! నిజానికి బుడిగిని తీసుకుని వాడు రాజమండ్రి లేచిపోయి వచ్చిం తర్వాత, క్రొత్తలో వాడు దొంగతనం చేయలేదు: ఉన్న కాసిని డబ్బులతోనూ, అదీ వాడూ కలిసి సినిమాలు చూశారు మిలిటరీ హోటళ్ళకు వెళ్ళి కడుపునిండా తిని,

అదే స్వర్గమనుకొన్నారు. డబ్బులయిపోయిం తర్వాతగాని, స్వర్గానికీ, నరకానికీ మధ్య ఒక పల్చని తెర మాత్రమే అడ్డు ఉన్నట్లు వాళ్ళకి తెలీలేదు. ఒకరోజూ, ఒకపూటా పస్తున్న తర్వాత, భయం భయంగా అడిగింది బుడిగి.

"ఏం చేద్దాం మావా?"

సింహాద్రికి ఏం చేయాలో తోచలేదు. తీవ్రంగా ఆలోచించాడు. తనకు చదువురాదు, వృత్తి విద్య అసలే రాదు. కొంచెం హస్తలాఘవం మాత్రం అబ్బింది. అందులో సింహాద్రికి పెద్ద తప్పు కనిపించలేదు. లోకంలో కొందరు కనిపించే దొంగలు; కొందరు కనిపించని దొంగలు. ఎవడి స్వార్థం వాడికి దొంగతనం నేర్పుతున్నది. స్వార్థంలేని పెద్ద మనిషి ఎవడు?

ఒక నిర్ణయానికివచ్చి లేచివచ్చిన నెల రోజులకు మొదటిసారిగా సింహాద్రి దొంగతనం చేశాడు. బుడిగి ఆకలి తీరింది మొగుడు ఎలాసంపాయిస్తే తన కెందుకూ అను కొన్నది. కానీ వోసారి దొంగతనం చేస్తూ చేస్తూ వాడు పట్టుబడినప్పుడు అది విపరీతంగా భయపడిపోతూ, "మావా! మావా! వద్దు మావా! ఆకలితో అయినా చద్దాం; దొంగ లుగా మాత్రం బతకొద్దు" అన్నది పోలీసుల మధ్య గంభీ రంగా నిలబడ్డ సింహాద్రి కాళ్ళమీద పడుతూ. సింహాద్రి మెల్లగా వంగి, బుడిగి బుజాలను పట్టుకుని లేవనెత్తి తన దగ్గరకు తీసుకున్నాడు. "భయపడమాకే! తొందర్లోనే వస్తా" అన్నాడు. అలా అంటున్నప్పుడు వాడి గొంతులో ఏదో అడ్డుబడినట్లయింది.

వాడి బ్రతుకే అట్లా రావటం - పోవటం అయింది. వచ్చినప్పుడు ఎండలో తిరిగేవాడు. గోదావరి గాలిపీల్చుకునే వాడు. బుడిగికి తిండి పెట్టేవాడు; శారీరకమైన వాంఛలను తీర్చేవాడు. అలవాటుపడ్డ బుడిగి అతని పనులకు అడ్డుచెప్ప డం మానుకొంది. వియోగం వాళ్ళను మరింత దగ్గరకు చేర్చేది. వాళ్ళిద్దరూ ఒకటైం తర్వాత, మూడోసారి వాడు జైల్లోకి వెళ్ళేటప్పుడు "మావా! ఈసారి నువ్వొచ్చేసరికి ఇంట్లో మనిద్దరమే కాదు ఉండేది!" అన్నది సిగ్గుతో కనురెప్ప క్రిందికి వాల్చుతూ దోర నవ్వును పెదాలపై దాచుకుంటూ.

"అయితే పుట్టబోయే బుల్లోణ్ణి జాగ్రత్తగా చూసుకో. రెక్కలు కట్టుకు ఎగిరొస్తా బైటికిరాగానే" అన్నాడు. "కాదు, బుల్లిది" బుడిగి పావురంలా అంటున్న మాటలు వాణ్ణి విననీయకుండానే పోలీసులు సింహాద్రిని జైలుకు తీసుకు వెళ్ళిపోయారు.

నడుస్తూ ఆలోచించుకుంటున్న సింహాద్రికి కూతురు సీతాలు జ్ఞాపకం వచ్చింది దానిమీదకు పోయిన ఆలోచన లను వెనక్కు తీసుకోవడం వాడికి కష్టమైంది. "గొప్పోరిఇంట పుట్టాల్సిన పిల్ల. లక్ష్మీదేవిలాంటిది. నా కొంపన పడ్డది" అన్నని దాని రూపం వాడి కళ్ళముందు కన్పించింది.

వాడు జైలుకు వెళ్ళేటప్పుడు సీతాలుకు జ్వరం కాస్తోంది. "ఎట్లా ఉందో నా తల్లికి" సింహాద్రి హృదయం ప్రేమతో గిజగిజలాడిపోయింది.

"మా నాన్న నెందుకు పట్టుకెళ్తారు? వదిలిపెట్టండి" అన్నది సీతాలు, క్రిందటిసారి సింహాద్రిని పోలీసులు పట్టు

కెళ్తున్నప్పుడు వాళ్ళ కాళ్ళ కడ్డం పడుతూ, కోపంతో వణికి పోతూ.

"ఎందుకా?" ఒక పోలీసు లాటీ ఝాడిస్తూ అన్నాడు "దొంగతనం చేసినందుకు."

ఆ మాట సీతాలుకు అర్థం కాలేదు. తండ్రివేపు చూసింది. సింహాద్రి మొట్టమొదటిసారిగా తప్పు చేసినట్టుగా సీతాలుకు సమాధానం చెప్పలేక మొహం ప్రక్కకు తిప్పుకున్నాడు సమాధానం లేక, పోలీసులు తండ్రిని పట్టుకు వెళ్ళడం చూసి; సీతాలు బిగ్గరగా ఏడ్వడం మొదలెట్టింది ఆ ఏడ్పు సింహాద్రి చెవుల్లో లావాలా ప్రవహిస్తోంది. "ఛా! ఛా! పిల్ల పెద్దదౌతోంది. ఇహ దొంగతనం చెయ్యకూడదు" అనుకున్నాడు పోలీసుల మధ్యనున్న సింహాద్రి.

రోడ్డుమీద నడుస్తోన్న సింహాద్రికి అదంతా జ్ఞాపకం వచ్చింది "దొంగతనం చెయ్యకూడదూ?—" అతనిలో ప్రశ్న. "చిన్న చేపను పెద్ద చేప మింగుతుంది. ఇదీ అంతే"

కాలేజీ దాటి, కూడలిదాటి, సీతంపేట వైపుగా మలుపు తిరిగాడు సింహాద్రి. ఆలోచించుకుంటూ మలుపు తిరగడంలో పదేళ్ళు దాటని పసిపిల్ల కొకతెకు ఢీ కొట్టాడు. ఢీకొట్టి వెనక్కో అడుగు వేశాడు. ప్రక్కనే మెరుస్తూ రూపాయిబిళ్ళ కనబడింది. అనుకోకుండా దానిమీద కాలు వేసి దాచిపెట్టి, తను ఢీకొట్టిన అమ్మాయివైపు చూశాడు. ఆ అమ్మాయి కంగారు కంగారుగా "రూపాయి, రూపాయి పడిపోయింది" అంటూ ఆ సందె చీకట్లోనే అటూ ఇటూ

వెతికడం మొదలుపెట్టింది. ఆ అమ్మాయి కళ్ళలో నీళ్ళు పేరుకుంటున్నాయి. గొంతు భయంతో,దుఃఖంతో పూడుకుపోతున్నది. "రెండు రోజుల్నించీ వన్నం లేదు, అదీ మా అమ్మ వండలేదు. దొరగారు పెట్టిన చద్దన్నమే నాకు పెట్టి తను తినకుండా పూరుకొంది. బియ్యం లేవుట. మా అయ్య తీసుకు రాలేదుగా?—ఎక్కణ్ణుంచి వస్తాయి? ఇవ్వాళ దొరగారి ఇంటినుంచి వస్తూ వస్తూ మా అమ్మే తీసుకొచ్చింది రూపాయ్. అదే నాకిచ్చి, బియ్యం తీసుకురమ్మంది" సింహాద్రికి ఆ పిల్ల మాట్లాడ్తుంటే సీతాలు జ్ఞాపకం వచ్చింది. సీతాలు ఇంతే! మాటా మాటా తుంచేసి ఎదుటివారి గుండెలను పిండేస్తుంది!! ఆ అమ్మాయికి నిస్సహాయత తెలిసినకొద్దీ భయం వేస్తున్నది. భయంతో గుండెలను చిక్కబట్టుకుంటూ, వచ్చే వచ్చే ఎక్కిళ్ళను బలవంతాన ఆపుకుంటూ మళ్ళీ మాట్లాడింది. "అయిదు కొట్లల్లో అడిగాను, లేవన్నారు. కొటగుమ్మం దగ్గరేదో కొట్టుందట; అక్కడిస్తున్నారట. అందుకని, అక్కడికని వెళ్తుంటే..." ఆశ చావక మళ్ళీ మళ్ళీ వెతుకుతోంది. "రూపాయి దొరక్కపోతే ఎట్లా? బియ్యం ఎట్లా కొనడం?" ఆ అమ్మాయి పడ్తున్న తపన చూసి,పోసీ కాలికింద దాచిపెట్టిన రూపాయి బిళ్ళను ఆ పిల్లకు ఇచ్చేద్దామా అనుకున్నాడు. అనుకుంటూనే అడిగేశాడు. "రూపాయి దొరక్కపోతే ఎట్లా పిల్లా? మీ అమ్మ నిన్ను కొడుతుందా?"

ఆ అమ్మాయి అడ్డంగా తల వూపింది. "ఉహూ కొట్టదు. నేనంటే మా అమ్మకు ఎంతో ఇష్టం"

"మరి... ...?" సింహాద్రి ఏదో అడగబోయాడు. అడ్డుకుంటూ మళ్లీ ఆ అమ్మాయే సమాధానం చెప్పింది.

"రూపాయి లేకపోతే, బియ్యం కొనకపోతే, మా అమ్మకు ఈ రాత్రికి అన్నం ఎవరు పెడతారు?"

ఈమాటవిని సింహాద్రి హృదయపు అట్టడుగు పొరల్లో వున్న మానవత్వం కొద్దిగా కదిలింది. ఆ రూపాయి ఇచ్చేద్దామనీ, ఇచ్చేయడమే మంచిదనీ అన్పించింది. కానీ సీతాలు కళ్ళముందు మెదిలి, ఆ యత్నం విరమించుకున్నాడు. "ఈ రూపాయిస్తే నాతల్లి ఎన్నిబొమ్మలైనా కొనుక్కుంటుంది!"

ఆ అమ్మాయి యింకా వెతుకుతూనే ఉంది, ఆ దుమ్ములో—ఆ రాళ్ళలో, చీకట్లమధ్య. సింహాద్రి ఉన్నట్టుండి కొంచెం పౌరుషంగా అన్నాడు. "వెళ్లు వెళ్ళు; చీకటి కూడా పడ్డది. ఇంకా ఏం వెతుకుతావ్? వెళ్ళి మీ అమ్మను ఇంకో రూపాయి ఇమ్మను" అతనికీ తెలుసు, వాళ్ళ అమ్మ ఇంకో రూపాయి ఇవ్వలేదని. ఆ పిల్ల జాలిగా చూసింది. సింహాద్రి కళ్ళలో విసుగు, కోపంగా మారుతోంది "పో! చెప్తుంటే వెళ్ళవే?" అన్నాడు కఠినంగా. ఉలిక్కిపడి, సింహాద్రివేపు చూసి, ఆ కళ్ళల్లోని రక్తపుజీరకు కారణం తెలుసుకోలేక ఆ పిల్ల అయిష్టంగానే అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది. అల్లంత దూరం ఆ పిల్ల వెళ్లింతర్వాత, అటు, ఇటు చూసి ఒక్కసారిగా వంగి, కాలిక్రింద అణచిపెట్టిన రూపాయి బిళ్ళను చేతికి తీసుకుని, లాల్చీ జేబులో వేసుకుని ఇంటి వేపుగా నడవడం ప్రారంభించాడు సింహాద్రి. అతని మన

స్సును రెండుగా విడగొట్టి ఒక భాగాన్ని సంతృప్తి, రెండవ భాగాన్ని అసంతృప్తి రాజ్యమేలుతున్నాయి.

అతనికి ఎంతో హుషారుగా ఉంది. "భలే బోణీ!" అనుకున్నాడు. అతనికి దీపకాంతిలో స్నానం చేస్తున్నట్లనిపిస్తోంది. గోదావరిమీదనుంచి పరుగెత్తుకు వస్తున్న చల్లని గాలి అతని నరాల్లోకి ప్రాకి వాటిని ఉద్రేకపరుస్తోంది. కోటిలింగాల రేవుదాటి, వెదుళ్ళ అడితీలుదాటి మరికొంచెం ముందుకువెళ్ళి ఓ రేకుల గదిముందు నిలబడ్డాడు. రేకు తలుపులు మూసిఉన్నాయి.

"సీతాలూ—వో సీతాలూ!" అన్నాడు ప్రేమగా. ఎవ్వరూ పలకలేదు. తలుపుమీద చప్పుడుచేస్తూ "బుడిగీ!" అన్నాడు అధికారంగా. ఎవ్వరూ స్వాగతం చెప్పలేదు. తలుపులు నెట్టాడు; అవి మెల్లగా విడివడ్డాయి.

ఇంట్లో వో మూల చిసిగిపోయిన చాపమీద పిల్లది ప్రాణంలేని కట్టెలా పడివుంది. 'అమ్మలూ...' అంటూ పరుగెత్తుకువెళ్ళి పిల్లదాని తలను వళ్ళోకి తీసుకున్నాడు.

సీతాలుకు జ్వరం కాలిపోతోంది. నుదుటిమీద చెయ్యివేసి చూశాడు, చెయ్యి చురుక్కుమంది. ఉండి ఉండి పిల్ల ఉలిక్కిపడుతోంది. "కొట్టొద్దు, కొట్టొద్దు, నేను దొంగను కాను" అంటోంది.

"అమ్మలూ! బొమ్మలు కావాలన్నావు; డబ్బులు తెచ్చాను. ఎన్ని కొనుక్కోవచ్చో!" సీతాలు కళ్ళువిప్పి చూడలేదు. మన లోకంలో లేనట్టు పడిఉంది. చిక్కి శల్యావ

కష్టమై దీనంగా కన్పిస్తోంది. పరికిణీకి బదులు వంటికి ఏదో పాత గుడ్డ చుట్టబడివుంది. దాని వంట్లోవున్న నిగనిగ ఎక్కడికి పోయిందో సింహాద్రికి తెలీలేదు. అట్లాగే చూస్తూ కూచుండిపోయాడు.

"వచ్చావా మావా!" వెనగ్గా బుడిగి కంఠస్వరం— పోగొట్టుకున్నదేదో దొరికినంత సంతోషంగా. "హాసి— నువ్వటే?" సీతాలు తలను మెల్లగా తప్పించి, లేచి నిలబడి పరుగెత్తుతున్నట్టుగా ముందుకు నడిచి భార్యను కావలించుకొన్నాడు బుడిగి చెంపలమీదుగా కన్నీళ్ళు కారిపోతున్నాయి.

"ఎన్నాళ్ళకొచ్చావ్ మావా?"

"రెన్నాల్లే కదుటే?"

"నీకు రెన్నాళ్లూ, నాకు రెండేళ్లూ."

"వచ్చేసేను కాదే?"

సింహాద్రి మెడచుట్టూ చేతులువేసి దగ్గరకు లాక్కుంది బుడిగి. "ఈ రెన్నెళ్లూ ఎన్ని బాధలు పడ్డాననీ? కూడే దొరకనేడు మావా! పిల్లదాన్నికూడా పస్తే ఉంచాను. జొరం కాస్తే..." బుడిగి గొంతులో దీనత్వం, కళ్ళలో నీడలు. "ముందు మందట్రా మావా! అదే పోదా అని పస్తాయించాను; పొద్దుటికి అమ్మోరిలా పెద్దదైంది. ఆ డాక్టరుబాబు నిజంగా దేముడు. ఇట్టా జొరం అని సెప్తే, అట్టా సీటీరాసి, గొట్టాలట్రా. అన్నాడు."

కొంత వినీ కొంత వినకా, లాల్చీ జేబుల్లోకి చెయ్యి పెట్టాడు సింహాద్రి. రూపాయిబిళ్ళ కన్పించలేదు. ఖంగారు పడి జేబులు గాలించాడు. చేతులు బయటకు వచ్చాయి.

రంగులు మారిపోతున్న మొగుడి మొహం వంక చూస్తూ "ఏటి మావా!—ఎతుకుతున్నావ్?" అన్నది బుడిగి ఉండబట్టలేక.

"డబ్బులే!"

"ఎక్కడివి?"

"ఓ పిల్లదాని దగ్గర కొట్టేసినా"

"ఓ దొంగ నచ్చినాడు ఇట్టాగే అని మన పిల్లదాన్ని నంపేసినాడు మొన్న. అప్పట్నుంచే దాని మనసు సెడిగో వాది. అది మనీపర్సు కొట్టేసిందట. ఎవరో దొంగెదవ పరుగెత్తి పోతూ, పోతూ, రోడ్డు పక్కన నిలబడ్డ దీని సేతుల్లో పారేసినాట్ట ఉత్తి పర్సు"

"నరికేస్తా వాణ్ణి" సింహాద్రి పళ్లు బిగించాడు. "నా సీతాలు దొంగ. సీతా!"

"సర్లే, ఆణ్ని బగమంతుడే నరుకుతాడు. ముందీ గొట్టాలట్రా. పిల్లదాన్ని బతికించు."

కనిపించని భగవంతుడు తన మీదెందుకు కక్ష కట్టాలో తెలీలేదు సింహాద్రికి. "సర్లే" అని అయిష్టంగా గడపదాటి వెళ్ళబోయాడు.

"మరి మందెట్టా మావా?"

సింహాద్రి సమాధానం చెప్పలేదు. ఎప్పుడిక సింహాద్రి సమాధానం చెప్పడో అనుభవంలోకి వచ్చిన బుడిగి ఆ విషయమై మరి రెట్టించలేదు. డబ్బెట్లా వస్తుందో ఇద్దరూ ఎవరికి వారే వూహించుకున్నారు. డబ్బుకూ, అన్యాయానికీ లంకె వుంది.

"తొందరగా రా మావా!"

"ఛాన్ను తగలద్దు లే?" కొంత అపనమ్మకంతో ఆ మాట అని, "పిల్లది జాగ్రత్త. మొహంమీద తడిగుడ్డెయ్" అంటూ తలవంచుకు వీధిలోకి వెళ్ళాడు.

ఆ వెళ్ళడం వెళ్ళడం వో మెడికల్ షాపుకు వెళ్లాడు. "అయిదు గొట్టాలూ పది రూపాయలు" అన్నాడు బల్లమీది డబ్బులు లెక్కపెట్టుకుంటున్న టెర్లిన్ షర్టు బట్టతల నడి వయసు పెద్దమనిషి. బరువుగా బయటకు రోడ్డుమీదకు వచ్చేసేడు సింహాద్రి. వెనగ్గా నవ్వులు.

బయట ఆకాశంలో చంద్రుడు మబ్బుల ప్రక్కకు తప్పుకున్నాడు. ఎలక్ట్రిక్ దీపాలు బాధితుడి హృదయ జ్వాలలా జ్వలిస్తున్నాయి ఎనిమిదింటికే రాజమండ్రి నిద్ర కుపక్రమిస్తోంది. సింహాద్రి గోదావరి స్టేషనుకు వచ్చాడు. ఎదురు మదురుగా వున్న ప్రయాణీకులు తప్ప, రద్దీ కన్పించ లేదు తొందర్లో బండి ఏదీ వచ్చే సూచనలేదు. ప్లాట్ ఫారంమీద అటూ, ఇటూ కొంచెంసేపు తిరిగాడు. గోదావరిమీదనుంచి వచ్చే చలిగాలితప్ప మరెవరూ అతన్నిపలక రించలేదు. స్టేషన్లోంచి బయటకు వచ్చి కోట గుమ్మం వైపుగా నడిచాడు. కొంచెం సందడిగా ఉంది అక్కడ. ఫర్వాలేదు; మనుషులున్నారు. బేరాలు సాగుతున్నాయి. డబ్బు నీళ్ళలా ప్రవహిస్తోంది అక్కడ సెంటర్లో నిలబడి అటూ,ఇటూ చూస్తూ ఆలోచిస్తున్నాడు సింహాద్రి. "ధర్మం సేండి బాబూ! పున్నెముంటది" కళ్ళులేని కబోది దీనంగా

అరుస్తోంది. దూరంగావున్న మసీదులోంచి అరబిక్ ఆజ్రా ప్రార్థనాగీతం గాలిలో సుళ్ళు తిరుగుతోంది.

ఖాన్సుకోసం ఎదురు చూస్తున్నాడు సింహాద్రి.

ఎదురుచూస్తూ నిలబడ్డ సింహాద్రి దగ్గరకు ముసి ముసిగా నవ్వుతూ ఒకతను వచ్చాడు. వస్తూనే "వస్తారా సార్?" అన్నాడు.

సింహాద్రి ఆలోచిస్తూనే "ఎక్కడికి?" అన్నాడు.

"మొన్నేసార్ వచ్చింది. పసారానికి పూర్తి కొత్త. మీలాంటోళ్ళు" దూరంగా ఎర్రబుట్టకన్పించడంతో, మధ్యలో ఆపేసి, తొందరతొందరగా "పోదాం పదండిసార్" అన్నాడు "అక్కర్లేదు" సింహాద్రి సమాధానంవిని పెద్దమనిషి తెల్లబోయాడు. ఎగా దిగా చూస్తూ. "ఓస్పోసి" అంటూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. సింహాద్రికి ఆగంతకుని మాటలు కొంత అర్థమయాయి. "ఎవరి తాపత్రయం వాళ్ళది" అనుకున్నాడు. అతనికి బుడిగి జ్ఞాపకం వచ్చింది. జ్వరంతో వున్న సీతాలు కళ్ళముందు మెదిలింది. సీతాలుతో పాటు రూపాయి పారవేసుకున్న పసిది జ్ఞాపకం వచ్చింది. అతని హృదయం కలుక్కుమంది.

కోట గుమ్మం దగ్గర లాభం లేదనిపించి ప్రక్కసందులోకి తిరిగాడు. గోపాలస్వామి ఆలయంలో దీపాలు వెల్గుతున్నాయి. దేముని విగ్రహం దూరంనుంచే ఆకర్షిస్తోంది. దేవాలయం నిండా ఎక్కువమంది ఆడవాళ్ళు. సింహాద్రి దేవాలయం ముందు ఆగాడు. పూజారి హారతి ఈయడంకన్పిస్తోంది "సీతాలుకు జ్వరం తగ్గితే బాపుణ్ణి"

సింహాద్రికి అక్కడకు వచ్చిన ఆడవాళ్ళ మెళ్ళల్లో దీపకాంతికి మెరుస్తున్న రాళ్ళ నెక్లెసులు కంటపడ్డాయి. ఒకావిడ మెళ్లో అయిదుపేటల చంద్రహారం మరోకావిడ నాజూగ్గా మోచేతివరకూ బంగారపు గాజులు వేసుకుంది. సింహాద్రి కళ్ళు మెరిశాయి. అతని బుద్ధి అతన్ని వత్తిడి చేస్తున్నది. అతడు తన జీవితంలో మొట్టమొదటిసారిగా దేవాలయం లోపలకు వెళ్లాడు. వెళ్లి దేముని ముందు అనుకోకుండా చేతులు కట్టుకు నిలబడ్డాడు. గోపాలస్వామి తనవైపే చూస్తున్నట్లనిపిస్తోంది. "నా తల్లికి జ్వరం తగ్గాలి" అనుకున్నాడు. కళ్ళు మూసుకుని, చేతులు రెండూ జోడించాడు. చేతులు జోడించడంలో అంతవరకూ గుప్పిటమధ్య వున్న మందు చీటీ నలిగిపోయింది.

"తీర్థం పట్టు నాయనా!" పూజారి కంఠస్వరం. తల నెరిసిన మనిషి. శరీరం పండిపోయింది. సింహాద్రి చీటీని చెవిలో దోపుకుని, అంజలి ఘటించి, తీర్థం పుచ్చుకున్నాడు. తీర్థం పుచ్చుకొన్నవాళ్ళు ఒక్కొక్కరే స్వామికి నమస్కరించి వెళ్ళిపోతున్నారు. ఆడవాళ్ళు అడుగుముందుకు వేసినప్పుడల్లా బంగారపు నగల రసరస అతడి చెవులను కోసివేస్తున్నది.

దేవాలయం దాదాపూ నిర్జన మౌతున్నది. దేముణ్ణి గర్భగుడిలోపల బంధించటానికి పూజారి సిద్ధమవుతున్నాడు. సింహాద్రి రెండడుగులు ముందుకువేసి నిలబడ్డాడు. గోపాలస్వామి నిండు విగ్రహం అతని కంటపడుతున్నది. నెత్తిన పింఛమూ, మెరుస్తున్న కళ్ళూ; "ఓహో! ఆ కళ్ళలో

నీలాలు తాపి ఉంటాయి" అనుకున్నాడు సింహాద్రి. ఆ భువన మోహనమూర్తి పెదవులు విడి విడకుండా మురళిని వాయిస్తున్నాడు. "అది బంగారపు మురళే. సందేహంలేదు" అనుకున్నాడు సింహాద్రి. గోపాలుని మెడలోని హారాలు ఒక దానితో ఒకటి అందానికీ, ఆశ్రయానికీ కలహించుకొంటున్నాయి. సింహాద్రి దృష్టి ఆ హారాలమీద పడింది. గోపాల స్వామి పట్టుబట్ట కట్టుకున్నాడు. కట్టుకుని మామిడి పిందెల మొలతాడుమీద బిగించాడు. కాళ్ళకు రత్నాల కడియాలు. చూస్తూ చూస్తూ సింహాద్రికి సీతాలు జ్ఞాపకం వచ్చింది.

సీతాలుకు జ్వరం వచ్చింది. దానికి జ్వరం తగ్గాలి, సీతాలు ప్రక్కనేవున్న బుడిగి బోసి మెడతో నుంచుంది, దీనంగా, పేదగా, దిగులుతో.

పూజారి గర్భగుడి తలుపులు మూసి, "పద నాయనా!" అంటూ సింహాద్రితో కలిసి బయటకువచ్చి సింహద్వారం మూసివేశాడు. సింహాద్రి పూజారి ప్రక్కనే నడుస్తున్నాడు. అతని కళ్ళల్లో సీతాలు, అతని మనసులో బుడిగి. పూజారి, దేవాలయం ప్రక్కనేవున్న తన కుటీరంలోకి వెళ్ళి తాళం చెవులు భద్రపరిచి మళ్ళీ బయటకు వచ్చాడు.

ఇంకా సింహాద్రి అక్కడే వున్నాడు.

"ఎవరు నాయనా నువ్వు?"

"దాహం కావాలి తాతా!"

"లోపలకు రా నాయనా!" పూజారి లోపలకు వెళ్ళాడు. సింహాద్రి లోపలకు వచ్చాడు. ఎదురుగా గూట్లో

రాములవారి పటం. పెనగ్గా ఆలయం తాళం చెవులు. లోప లకు వెళ్ళిన పూజారి ఇంతట్లో బయటకు వస్తాడా? సింహా ద్రికి గోపాలస్వామి విగ్రహం నిల్చింది కళ్ళముందు. విగ్రహ మంతా బంగారపు తొడుగే. సింహాద్రి పిరికిగాలేచి నిలబడి, భయంగా ముందుకు అడుగువేసి, వణుకుతున్న చేతులతో తాళం చెవులు తీసుకుని బొడ్లో దోపుకుని లాల్చీ సరి చేసు కుని ధైర్యంగా తిరిగి వచ్చి సంతృప్తితో యథాస్థానంలో కూచున్నాడు.

పూజారి మజ్జిగ వోక గ్లాసులో వొంచుకుని, ఇంత భగవత్ప్రసాదం పళ్ళెంలో పెట్టుకుని తీసుకువచ్చాడు.

"తీసుకో బాబూ!"

సింహాద్రికి ఆతన్ని చూసి నమస్కారం చేయాలనిపిం చింది. "మీకు పిల్లలున్నారా తాతా?"

పూజారి బరువుగా తల వూపాడు. "ఇప్పుడు కాదు" వాతావరణం గాలి చేస్తున్న చప్పుళ్ళతో వింతగా ధ్వని స్తోంది. "ఒకడు దొంగ, మరొకడు అప్రయోజకుడు దొంగను నేనే ఇంట్లోనుంచి తరిమేశాను. ఆ అప్రయోజకుడు భార్యా దాసుడై నన్నే ఇంట్లోనుంచి తరిమేశాడు. ఇప్పుడా వేణు గోపాలుడే తల్లీ తండ్రీ కూతురూ సమస్తమూనూ."

సింహాద్రి ప్రసాదంపుచ్చుకొని మజ్జిగ తాగి "వస్తాను తాతా!" అన్నాడు లేచి నిలబడుతూ.

"జాగ్రత్త నాయనా! అమాయకుడిలా ఉన్నావ్" పూజారి కంఠస్వరం వెనకనుంచి బుజ్జగిస్తోంది. సింహాద్రి రోడ్డుమీదకువచ్చి మళ్ళీ దేవాలయం దగ్గరకు వెళ్ళాడు.

పూజారి ఇంట్లో దీప కాంతి తగ్గడం అతనికి కన్పిస్తోంది. పూరు మాటు మణుగుతోంది. సందు నిద్రపోతోంది.

సింహాద్రి తొందర తొందరగా దేవాలయం తలుపులు తెరచి, తను లోపల దూరి మళ్ళీ తలుపులుమూశాడు.

విశాలమైన దేవాలయం. ఒంటరిగా తను; భయం తెలియని సింహాద్రికి భయం వేసింది.

గుండెలు చిక్కబట్టుకుంటూ ముందుకు నడిచాడు. తలుపు కన్నాలలోంచి లోపల బందీగావున్న గోపాలస్వామి కనబడుతున్నాడు. ఇంకా అతడు నిద్ర పోలేదులా ఉంది. కళ్ళు మెరుస్తున్నాయి.

సింహాద్రి పిరికి పిరికిగా గర్భగుడి తలుపులు తెరిచాడు కీచుమంటున్న శబ్దం. అతని గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. గబగబా ప్రక్కకు తప్పుకున్నాడు. మళ్ళీ నిశ్శబ్దం; ఉచ్ఛ్వాస నిశ్వాసాలు విన్పించేటంతటి నిశ్శబ్దం. సింహాద్రి స్వామికి ఎదురుగా నిలబడ్డాడు.

దేముడు మానవుణ్ణి చూసి నవ్వుతున్నాడు. మానవుడు దేముణ్ని చూసి భయపడుతున్నాడు.

సింహాద్రి చేతులు వణుకుతున్నాయి. లోపల పాములా మెలికలు తిరుగుతున్న కోర్కె నిట్టూర్పు రూపాన బుస కొడుతోంది. స్వామి ఒంటిమీద చెయ్యి వేశాడు సింహాద్రి. రాతి దేముడు మాట్లాడలేదు.

సింహాద్రి గుండెలు చిక్కబట్టుకొని ఒక్కొక్క అలంకారమే వొల్చి క్రింద పెట్టాడు. నేలమీద ఉన్న బంగారపు నగలు మెరిసిపోతున్నాయి. నగల్లేని దేముడు, దేముడిలా కనబడటంలేదు. రత్నాల కన్నుల్లేక దేముడు గుడ్డివాడై పోయాడు. సింహాద్రి ధైర్యంగా నగలనన్నింటినీ మఫ్లర్‌లో మూట కట్టుకుని, వెనుతిరిగి చూడకుండా బయటికివచ్చి, బయటి తలుపులు మాత్రం దగ్గరకు వేసి, తాళం చెవులు గడప ప్రక్కన పడవేశాడు.

ఇహామీదట ఏం చేయాలి?

నగలతో ఉన్న సింహాద్రికి దేముడి భయం పోయి, కొన్ని క్రొత్తరకాల భయాలు పట్టుకున్నాయి. 'తనుతొందరగా ఆ బంగారాన్ని డబ్బుగా మార్చుకోవాలి ఎట్లా?' అన్నదే అతని తాపత్రయమైంది కొంతసేపటి క్రితం వరకూ మనుషులకోసం వెతికిన సింహాద్రి ఇప్పుడు మనుషుల నుండి పారిపోదా మనుకుంటున్నాడు. 'బంగారాన్ని ఖరీదు చేసే ఒక్క పెద్దమనిషి దొరికితే బావుణ్ణు!' అతని కింకేమీ అక్కర్లేదు

సింహాద్రి తనకు జ్ఞాపకమున్న వ్యక్తుల నందర్నీ తలుచుకున్నాడు. అందరూ సమాజపు అట్టడుగు పొరల్లో జీవిస్తున్నవాళ్ళు! డబ్బు కంట పడితేచాలు, పిచ్చికుక్కలై పోయేవాళ్ళు! "ఉహూ, వాళ్ళ లాభంలేదు. ఇంకా కొంచెం అంతస్థు ఉన్నవాళ్ళు కావాలి. బంగారపు వ్యాపారం చేసే

వాళ్లు, పాత బంగారం నగలు చేసేవాళ్ళు—అవును—అటు వంటివాళ్లే కావాలి"

సింహాద్రికి వీరభద్రాచారి జ్ఞాపకం వచ్చాడు. నగల మూటను జాగ్రత్తగా చంకన పెట్టుకుని సందులూ, గొందులూ తిరిగి అతని ఇంటికి వెళ్ళాడు సింహాద్రి. అతని ఇల్లు తాళం వేయబడిఉంది. ఎవరో సాధువులు ఆ ఇంటి అరుగులమీద నిద్ర రాక అటూ యిటూ దొర్లుతూ పద్యాలు పాడుకొంటున్నారు

సింహాద్రిని చూడగానే "నల్లనయ్య రక్షిస్తాడు, ధర్మం చెయ్ తండ్రీ" అన్నాడు వాళ్ళలో ఒకడు లేచి కూచుంటూ.

సింహాద్రి క్రీనీడలో నుంచుని అడిగాడు "ఈ ఇంటాయన ఎక్కడికి వెళ్లాడు?"

"మాకు తెలీదు" మరో మూలనుంచి కర్కశంగా సమాధానం వినిపించింది.

సింహాద్రి ఇహనక్కడ నుంచోలేదు; దానం చెయ్యలేదు. నగలమూటను పట్టుకుని రోడ్డుమీదకు వచ్చాడు. డబ్బు... డబ్బు... డబ్బు కావాలి సీతాలు కళ్ళముందు మెదుల్తోంది. డబ్బు కావాలి. డబ్బుంటేనే మందులు. మందులు లేకపోతే సీతాలు బతకదు. మందులు... మందులు... సింహాద్రికి అడుగులు తడబడ్డాయి. తూలి పడబోయి లైటు స్తంభం పట్టుకుని నిలద్రొక్కుకుని ఎదురుగా చూచాడు. ఒకే ఒక మెడికల్ షాప్, ఎడారిలో ఒయ్యా

సిస్నలా, సముద్ర మధ్యాన ఉన్నవాడికి లైటుహౌస్‌లా, కన్పించింది.

మెడికల్‌షాప్ ఆసామి కౌంటర్ ముందు కూచుని జోగుతున్నాడు. సింహాద్రి ఆ కొట్టుముందు కాసేపు తట పటాయించాడు. నగరంలో ఇంకే కొట్టూ తెరిచి వుండదు. మందు కావాలి, సీతాలు బ్రతకాలి. ఓ నిశ్చయానికి వచ్చి అతన్ని నిద్రలేపాడు.

"ఇదిగో ఈ గొట్టాలున్నాయా?"

విసుగ్గా నిద్రలేచిన కొట్టుగలాయన బేరగాణ్ణి చూసి మందహాసం తెచ్చుకున్నాడు. చీటీ తీసుకు పరిశీలించి "ఇవ్వా?—ఆఁ! ఉన్నాయ్! పన్నెండు రూపాయలియ్" సింహాద్రి మాట్లాడలేదు. ఆసామీకి అనుమానం వేసింది.

"ఏం, డబ్బులున్నాయా?" అన్నాడు మొహం గంటు పెట్టుకుంటూ.

"లేవు" సింహాద్రి నిర్భయంగా చెప్పాడు.

"అయితే ఎందుకూ ఇక్కడ? వెళ్లు, వెళ్లు ఇదేం ధర్మసత్రంకాదు, మందులషాపు"

"కోప్పడకయ్యా—...డబ్బుల్లేవు; బంగార మిస్తాను"

ఆసామీ కళ్ళు ఆశ్చర్యంతో విప్పారాయి "బంగారమా?" అన్నాడు ఆ మాటమీద వత్తిపలుకుతూ.

"అవును, ఇదిగో" అంటూ కడియా న్నొకదాన్ని తీసి బయట పెట్టాడు సింహాద్రి. ట్యూబులైటు కాంతిలో

కడియం లోభపర్చేట్లు మెరుస్తోంది. షావుకారు దాని వేపు పరకాయించి చూశాడు. సింహాద్రివేపు చూశాడు; బంగారం మెరవడం చూశాడు, సింహాద్రి మూటను గట్టిగా పట్టుకోవడం చూశాడు. అతని కన్నులు కొద్దిగా ముకుళించుకున్నాయి.

"ఉండు, మందిస్తాను. ఇట్రా, ఇక్కడకూర్చో"

సింహాద్రి లోపలకు అడుగు వేశాడు. ఆయన టెలిఫోన్ ఎత్తబోయాడు; సింహాద్రికి అతని నీచబుద్ధి అర్థమైంది.

"తనను, తనను పట్టిస్తున్నాడు వాడు. తను పట్టుబడకూడదు. సీతాలుకు జ్వరం; అది బతకాలి"

కడియం చేతిలోకి తీసుకోబోయాడు సింహాద్రి. కాని షావుకారు అప్పటికే ముందుజాగ్రత్తపడి, కడియం తన చేతిలోకి తీసుకోవడంతో చేసేదిలేక, అక్కడ ఉండనూ లేక పరుగెత్తి పారిబోయాడు.

పరుగెత్తి పారిపోతున్న సింహాద్రిని చూచి రోడ్డు మీది కుక్కలు అరుస్తున్నాయి. గాలి సుళ్ళు తిరుగుతూ నవ్వుతోంది. వగరుస్తూ లోపలకు వచ్చిన భర్తను చూచి, బుడిగి కంగారుపడుతూ "పోలీసులా?" అన్నది, తలుపు వేయటానికి లేవబోతూ.

"కాదు, నగలు"

బుడిగికి అర్థంకాలేదు. "అంటే?"

"దేముడి గుళ్ళోవి, గోపాలస్వామివి" మూట విప్పుతూ అన్నాడు సింహాద్రి.

"దేముడివా?" వణికిపోయింది బుడిగి. "దేముడి సొమ్ము తిన్నవాళ్ళెవళ్ళూ బాగుపళ్ళేదు. వొద్దు మావాఁ!"

నగలను ఒక్కటొక్కటే పరిచి చూస్తున్న సింహాద్రి, అర్థంకాక భార్యవైపు చూశాడు.

"మనిషి సొమ్ము మనిషితినొచ్చు మావాఁ! దేముడి సొమ్ము మాత్రం మనిషి తినకూడదు."

ఉండి ఉండి సీతాలు అటూ యిటూ దొర్లుతోంది. జ్వరానికి ఆగలేక బిగ్గరగా మూల్గుతోంది మధ్య మధ్యలో కలవరిస్తోంది. "నాన్నా! నేన్దొంగను కాన్నాన్నా! నాన్నా! నేన్దొంగను కాన్నాన్నా! మా నాన్న నెందుకు పట్టుకున్నారూ?—వదిలిపెట్టండి. నాన్నా! అమ్మా! అమ్మా! నువ్వయినా చెప్పవే."

బుడిగి తన పిల్లను ఒళ్ళోకి తీసుకుంది. సీతాలు మొహం నల్లరంగుకు మారుతోంది. పెదవులు ఎండి పగుల్లు బారుతున్నాయి. శరీరం ఉష్ణగుండంలా ఉంది.

"మావాఁ! వెళ్ళు. దేముడి సొమ్ము దేముడికి ఇచ్చెయ్! అట్టా చేయ్ మావాఁ!" బుడిగి కంఠం దీనంగా అంది.

సీతాలు వొళ్ళు చల్లదనానికి తిరుగుతోంది. వ్రేళ్లు వంకర్లు పోతున్నాయి. ఉన్నట్టుండి సీతాలు కళ్ళు తెరిచింది.

"నాన్నా!" అంటూ సంతోషంతో లేవబోయింది; లేవలేక తల క్రిందికి వాల్చేసింది.

"అమ్మా! సీతాలూ—వచ్చానే; నగలట్టుకొచ్చా, నువ్వెట్టుకుంటావని, నా అమ్మలు లచ్చిం దేవిలా ఉంటుం దని, ఇదిగోనే, ఇటు—ఈ కడియం..." సింహాద్రి కంఠం రుద్ధమైంది.

సీతాలు బలంలేని గాజుకళ్ళని ప్రక్కకు తిప్పలేక తిప్పింది ఆ నగలనుచూసిముందుగా ఎంతో సంతోషపడింది. చేతితో స్పర్శించి ఆనందించబోయింది; మళ్ళీ ఏదో జ్ఞాప కంవచ్చి చెయ్యి వెనక్కు తీసుకుంది.

"ఇవ్వెక్కడివీ?" నూతిలో నుండి మాట విన్పిస్తోంది. సింహాద్రి సమాధానం చెప్పలేదు.

"ఎత్తుకొచ్చావ్ కదూ?" ఆ తండ్రి తల వాల్చు కున్నాడు.

"ఇవి ఆ గోపాలస్వామి నగలు కాదూ?" ఆలుమగ లిద్దరూ ఆశ్చర్యంతో ఒకటయ్యారు.

"నే నెన్నోసార్లు ఆ గుడికి వెళ్లాను" సింహాద్రి కూతురువేపు చూడలేకపోయాడు. సీతాలుకళ్ళనుండి సంతత ధారగా నీళ్ళు కారిపోతున్నవి "మా నాన్న దొంగ; దొంగ కూతుర్ని నేను" చేతులు కొట్టుకొంటున్న సీతాల్లో నాడి బలహీనమౌతోంది.

సీతాలు స్థితి చూసి, భర్తను కుదుపుతూ అన్నది బుడిగి "ఎళ్ళు మావాఁ! ఆ నగలా దేముడికిచ్చి రెండు

లెంపలూ వాయించుకో. ఇంకెప్పుడూ సేనని ఒట్టేసుకో? పిల్లదాని వాక్కుతో సెప్పాడా దేవుడు. దానికి తెలివి ఇందుకే వొచ్చింది."

సింహాద్రికి లీలగా అంతరాంతరాళాలలో వో అనుమానం వేసింది. దేముడి సంగతి ఎట్టా ఉన్నా, తను అంత క్రితమే వో పిల్లదానికి నూకలు లేకుండా చేశాడు. ఆ వుసురు తగల్లేదు కదా?"

"ఆలోచనేటి మావాఁ? పిల్లదాని పేణం సూడు. దానికన్నా బంగారమెక్కువా నీకు?"

సింహాద్రి లేచి నుంచున్నాడు. అతనిలో సహస్రలనేకం మూగాకులేస్తున్నాయి. గుమ్మందాకా వెళ్ళి మళ్ళీ వెనక్కి వచ్చి, భార్యతో అన్నాడు "ఇదిగో, పిల్లదాని మీద ఒట్టేసి సెప్తున్నా! దానికోసం దొంగతనం మానేస్తున్నా."

బుడిగికి అర్థంకాలేదు ఆ మాట. "ఎందుకూ?" అన్నది. అని, "రేపటి సంగతి సరే, ఇవ్వాల్టి సంగతి సూడు. ముందా నగలు దేవుడి కిచ్చేసి లెంపలేసుకో" అన్నది మందలింపుగా.

సింహాద్రి సమాధానం చెప్పకుండా ఆ నగలమూటను తీసుకుని, అష్టవంకర్లుగా, తన జీవితంలా ఉన్న సందుల గుండా నడుచుకుంటూ గోపాలస్వామి ఆలయం చేరుకున్నాడు.

ప్రకృతి ప్రశాంతంగా పుణ్యస్త్రీలా కనిపిస్తున్నది. వెన్నెల పైనుండి వర్షంలా పడుతున్నది. ఇళ్ళల్లో నీడలు నిద్రపోతున్నాయి.

పూజారి ఇంటవైపుచూశాడు సింహాద్రి. అది నిమ్మకు నీరెత్తినట్టుగా ఉంది. దేవాలయంగడప దగ్గర తను పడేసిన తాళం చెవుల కోసం చూశాడు. ఇంకా అవి అక్కడే ఉన్నాయి. "ఓహ్! ప్రపంచమంతా దొంగలమయం కాదన్న మాట! పెట్టిన వస్తువు పెట్టినచోట ఉంటున్నది. అందులో ఎంత భరోసా ఉన్నదీ!"

వాటిని తీసుకుని, తలుపులు తీసి, లోపలకు ప్రవేశించాడు. ప్రవేశిస్తుంటే ఈసారి భయం వెయ్యలేదు. సంతోషంగా ఉంది గర్భగుడి తలుపులు తొంగి, గోపాలస్వామి నవ్వుతున్నట్లు కనిపిస్తున్నాడు. సింహాద్రిస్వామిముందు, మొగాళ్ళ మీద కూచున్నాడు. "తండ్రీ!" అన్నాడు చేతులుజోడించి. "ఇంక నే దొంగతనం సెయ్యను, మా అమ్మల్ని కాపాడు. ఇయ్‌గో నీ నగలు, ఒక్క కడియం మాత్రం—అవును సామీ—అది ఆడు కొట్టేసినాడు, నన్ను మోసం చేసినాడు—నాను తప్పు చేయలేదు నీకు అంతా తెలుసు; నన్ను రచ్చించు సామీ!"

సింహాద్రి హృదయం సంతోష తరంగ సంభరితమైంది. అతనికి తను శుచి అయినానన్న భావన కలుగుతోంది. ఆ నగలన్నీ గోపాలస్వామికి అలంకరించాలనిపిస్తోంది. వెనక్కు చూశాడు, ఎవ్వరూ లేరు.

సింహాద్రి, బంగారు మురళిని స్వామి హస్తాల మధ్య పదిలపరిచాడు హారాలు నల్లనయ్య మెడలో వేశాడు. పీతాంబరం మొలకు చుట్టి, మామిడి పిందెల మొలతాడు దానిపై అలంకరించాడు. ఆతర్వాత తలయెత్తి కన్నులపండువుగా స్వామి నిజదర్శనం చేసుకున్నాడు. "ఎంత అందంగా వున్నావు స్వామీ! నీ నగలు దొంగిలించాను" అనుకున్నాడు లెంపలు వేసుకుంటూ. ఆ తర్వాత వంగి, పాదానికి కడియం వెయ్యబోయాడు.

వెనగ్గా చప్పుడు.

ముంగాళ్ళమీదకు వంగి ఉన్న సింహాద్రికి అలంకరిస్తున్న చేతుల క్రిందగా కళ్ళను ధనుస్సులుచేసి వెనక్కు చూశాడు. మనుషులు పురుగుల్లాగా, పుట్టగొడుగుల్లాగా, ఆకల రూపాల్లాగా, నల్లగా కోపంగా, కన్పించారు హఠాత్తుగా లేచి నుంచున్నాడు.

"పట్టుకోండి, పట్టుకోండి దొంగ, దొంగ. దేముడి సొమ్ములు దొంగిలిస్తున్నాడు; వెధవ, స్కౌండ్రల్."

సింహాద్రి తలఎత్తి చూశాడు. ఆ కళ్ళల్లో ఆకలీ, కోపమూ కన్పించాయి జనంలో అతన్ని తిట్టినవాడికి. సింహాద్రికి తనను తిట్టిన ఆ పెద్దమనిషి మొహం పరిచయమైనదిగా కన్పించింది.

జనం కర్రలతో, రాళ్ళతో ముందుకు వస్తున్నారు. వెనకనుంచి పూజారి మాటలు బాధగా విన్పించాయి.

«నువ్వా!—అయ్యో, ఎందుకు చేశావీపని?»

సింహాద్రి, పూజారిని చూసి జవాబు చెప్పటానికి తడబడ్డాడు.

పూజారి, గోపాలస్వామి వేపు చూశాడు, "ఏమిటి స్వామీ? ఇదంతా!" అన్నట్లు. పూజారి దృష్టి స్వామి పింఛముపైనుండి వక్షుస్సు వైపుకు, వక్షుస్సుపైనుండి కటి మీదకు, కటిపైనుండి పాదాగ్రములపైకి మరలింది. పాదాలను చూసి ఆయన కంగారుపడ్డాడు. ఒకపాదానికి మాత్రమే కడియం ఉన్నది!

పూజారి ఉచ్చైస్స్వరంతో అన్నాడు "స్వామి రెండవ పాదానికి కడియం లేదు"

జనమంతా 'కడియం, కడియం' అని అరవడం మొదలెట్టారు. ఆ అరుస్తున్నవాళ్ళలో మరింత పెద్దగా అరుస్తున్న పెద్దమనిషివైపు చూశాడు సింహాద్రి. ఆ మొహం అతనికి మెల్ల మెల్లగా జ్ఞాపకం వచ్చింది ఆ మొహం 'తన దగ్గరినుంచి కడియం దొంగిలించిన మెడికల్‌షాపు యజమాని!'

సింహాద్రి కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి. పిడికిలి బిగించి, లేచి నుంచుంటూ, "నేను కాదు ఆ కడియం దొంగిలించింది" అంటూ అరిచాడు పెద్దగా.

"దైవసాన్నిధ్యంలో అబద్ధం చెప్పకు నాయనా!" వెనకనుంచి పూజారి స్వరం బాధగా ధ్వనించింది. "ఆ కడియం అక్కడ పెట్టు."

"నా దగ్గర లేదు, అదుగో ఆయన దగ్గరుంది—ఆ

మందులు కొట్టాయన దగ్గర" చూపులతో, వేళ్ళతో నిర్దేశించాడు సింహాద్రి.

"అ... బ... ద్ధం..." మెడికల్ షాప్ యజమాని వణికిపోయాడు అది కోపంతో అనుకున్నారు జనం.

"నే... నేను... గౌరవంతో బ్రతికేవాణ్ణి."

"అవును!" జనం వంతపలికింది.

"నామీద వీడికి కోపం." "కాదూ?" జనత తలూపింది.

"మందులిమ్మన్నాడు; డబ్బులిమ్మన్నాను. ఇస్తా పని ఇట్టా వచ్చాను. అప్పుడే అనుమానం వేసింది. వేసీ, వాడివెంట ఇట్లా వచ్చాను. అందుకని?..." "నిజం, నిజం. నీవు చెప్పిందే నిజం. వాడే దొంగ" జనం సముద్రంలా రొద చేసింది. 'దొంగ' అన్న పేరుతో ఆలయం ప్రతిధ్వనిస్తోంది. "దొంగతనం చెడ్డది నాయనా!" పూజారి జాలిగా అంటున్నాడు.

"నాను దొంగని కాను... నాను దొంగను కాను" సింహాద్రి గింజుకుంటూ అరిచాడు.

"కాకపోతే దొరవా?"

అవును, దొర్నే. మీరూ నిజంగా దొంగలు" ఆ మాటతో ఇరవై చేతులు పైకి లేచాయి పదికర్రలు సింహాద్రి తలమీద పడ్డాయి. "దేవుడా! తప్పు సేసినాను నన్నువ్వు రచ్చించలేదు. మనిషిగా మారినప్పుడు నన్ను సిన్నసూపు సూత్తున్నావ్! ఇదేటి నాయం!" అనుకుంటూ స్వామి పాదాల దగ్గర సింహాద్రి పడిపోయాడు పడిపోతున్న

వాడికి బుడిగి ఏడుస్తూ కళ్ళల్లో మెదిలింది. సీతాలు కళ్ళల్లో ప్రాణం లేక కనబడింది.

తెలివివచ్చి కోర్టులో జడ్జీగారి దగ్గర బోనులో నిల్చున్న సింహాద్రికి, మెడికల్ షాపు యజమాని తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడం కన్పించింది. "పెద్దమనిషి సాక్ష్యం!" పేలవంగా, జీవన సత్యం తెలుసుకున్నవాడిలా నవ్వాడు సింహాద్రి. ఆ నవ్వును అంగీకారంగా తీసుకుని రెండున్నర నెలలు కఠిన శిక్ష విధించాడు న్యాయాధిపతి. శిక్షపడి మళ్ళీ సెంట్రల్ జైలులోకి వస్తున్న సింహాద్రిని చూస్తూ అన్నాడు వార్డరు

"మొన్నేకదుట్రా నువ్ వెళ్ళింది?"

"అవును. మొన్ననే జైలులోకి వెళ్ళాను, ఇవ్వాళే విడుదలై వొచ్చాను" అన్నాడు సింహాద్రి సీతాలును తల్చుకుంటూ, బుడిగిని గూర్చి బాధపడుతూ, లోకంమీద కసితో.